క్లుప్తంగా

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



కిషోర్ వికాసంపై అవగాహన కల్పిస్తున్న పీఓ సునీల్ రాజశేఖర్

దెందులూరు : పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు కొనియాడారు. అంగన్‌వాడీ సిబ్బంది కిషోర్ బాలికలు చిన్నారుల సంక్షేమ సంపూర్ణ ఆరోగ్యం విద్యాభివృద్ధి లక్ష్యంగా సేవలందించాలని పెదపాడు ఐసీడీఎస్ పీఓ డాక్టర్ సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం దెందులూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మతో కలిసి కిషోర్ వికాసం పై అవగాహన సమావేశంలో నిర్వహించారు. లక్ష్యాలను సేవలను వివరించారు.

అభయాంజనేయస్వామికి విశేష పూజలు



అప్పనవీడులోని నాటికలు వేస్తున్న చిన్నారులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో విశేష సూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించి గోత్ర నామాలతో పూజలు చేసారు. అనంతరం భజన చేసారు. కోలాట నృత్య ప్రదర్శన చేసారు. సాయంత్రం వెండి బంగారుపుష్పాలతో పూజలు జరిపారు. చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి నిల్వలతో దోమల వృద్ధి



కాగుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కాగుపాడు గ్రామంలో జరుగుతున్న వెక్టార్‌కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు అమలు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నీటి నిల్వలు ఉండటం, దోమలు వృద్ధి చెందడంతో వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువ్యాపు వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాదికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సత్యనారాయణ, పిహెచ్‌సీ ఎన్‌సరోజిని లు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ జయంతి వేడుకలు

పెదపాడు: మండలంలోని ఏపూరులో ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 21 నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25న ప్రత్యేక పూజలు అనంతరం హనుమాన్ చాలీసా పారాయణ, 11 గంటల నుంచి మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

జంగారెడ్డిగూడెం: విద్యుత్ డివిజన్ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పైన వెళుతున్న ట్రాన్స్‌కో టవర్ లైన్ల మార్పు కోసం ఈ నెల 22 నుంచి జూన్ 1వ తేదీ వరకు వ్యవసాయ వి ద్యుత్ సమయాల్లో మార్పు చేశామన్నారు. ఈ మార్పు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వర్తిస్తుందన్నారు. ఏ గ్రూప్‌లో ఉదయం 2 నుంచి నుంచి 11 గంటల వరకు, బీ గ్రూప్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉంటుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

మత్స్యకార సంఘం ఏర్పాటు చేయాలి

టి.నరసాపురం: బొర్రంపాలెం పంచాయతీలో మరో మత్స్యకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బొర్రంపాలెం సచివాలయం వద్ద మత్స్యకార సంఘ సభ్యులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మత్స్యకార సంఘం సుమారు 300 మందితో కొనసాగుతుందన్నారు. సంఘంలో చీలికలు తెచ్చేందుకు కొంతమంది పంచాయతీలో ఉన్న 14 మంది వార్డు సభ్యుల్లో 9 మందికి తెలియకుండా తీర్మానం చేశారన్నారు. దీనిని రద్దు చేయాలని నినాదాలు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తీర్మానం రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండల విస్తరణ అధికారి శ్రీనివాసులుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

పని భారంతో వీఆర్‌ఓలు సతమతం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దెందులూరు: గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర కార్యదర్శి ఈనెల 17వ తేదీన విడుదల చేసిన జీవో నాలుగులోని మార్గదర్శకాలను సవరించాలని గ్రామ రెవెన్యూ అధికారులు కోరుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శి విడుదల చేసిన జీవో 4 మార్గదర్శకాల్లో జనాభా ప్రాతిపదికన గ్రామాన్ని రెండు సచివాలయాలుగా విభజించనున్నారన్నారు. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్ గా పరిగణనలోనికి తీసుకురానున్నారు. దీనిలో భాగంగా క్లస్టర్ పరిధిలో ఒక గ్రామ రెవెన్యూ అధికారి, ఒక సర్వేయర్ మాత్రమే ఉంటారని తెలిపారు. ఇది సైతం భూవిస్తీర్ణం ఆధారంగా కాకుండా జనాభా ప్రాతిపదికను విభజించనున్నారని పేర్కొన్నారు. దీని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 7,500 మంది గ్రామ రెవెన్యూ అధికారులు ఏ శాఖ పరిధిలోకి వస్తారన్న విషయమై స్పష్టత లేదన్నారు. ఇదే జరిగితే వివిధ ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో పనిభారమైనప్పటికీ పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులపై మరింత ఒత్తిడి పెరుగుతుందని, దీని కారణంగా వారు అనారోగ్య కారణాలు, ఇతర ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. సచివాలయాల్లో నియమితులైన గ్రామ రెవెన్యూ అధికారులు తమ మాతృ శాఖ అయినా రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో కాక మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందన్నారు. 2019వ సంవత్సరంలో సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టినప్పుడు సైతం గ్రామ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి లేదని వారు అన్నారు. ప్రభుత్వం రెవెన్యూ గ్రామాల వారీగా ఒక వీఆర్‌ఓను నియామకాన్ని కొనసాగించాలని వారు కోరారు. గ్రామ రెవెన్యూ అధికారులను జీవో 4 పరిధి నుంచి తప్పించాలని వారు కోరుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి ఏలూరు రూరల్ 4 మండలాల్లో దాదాపు 50 మంది పైగా వీఆర్‌ఓలు విధులు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా నాలుగు మండలాల్లో వీఆర్‌ఓలు, తహసీల్దార్లకు వినతి పత్రాలను అందజేసి తమ ఆవేదనను తెలియజేశామన్నారు.

నేడు సీసీఎల్ఏతో భేటీ

సీసీఎల్ఏతో బుధవారం అమరావతిలో వీఆర్ఓ రాష్ట్ర అసోసియేషన్ నాయకులు భేటీ అయి వినతిపత్రం అందజేస్తారు. సీసీఎల్ఏ స్పందనతో వీఆర్‌ఓలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే భవిష్యత్ కార్యక్రమాన్ని రాష్ట్ర నాయకులు ప్రకటిస్తారన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

పెదపాడు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా పలువురికి పదువులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.పెదపాడు మండలంలోని అప్పనవీడు గ్రామానికి చెందిన షేక్ మీరా మైనార్టీ సెల్ అధ్యక్షునిగా, గుడిపాడు గ్రామానికి చెందిన ఘంటసాల ప్రభాకర్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కట్నే తులసీరామ్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా నాయుడుగూడెంకు చెందిన అక్కినేని గోపీలను నియమించారు.

ఆత్మీయ కలయిక

నిడమర్రు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం కలిసినట్లు ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ తెలిపారు. అధినేతను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధినేత పలు సూచనలు చేశారని తెలిపారు.

టంగుటూరి జీవితం ఆదర్శప్రాయం



భీమడోలులో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: ఆంధ్రకేసరి, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు మంగళవారం ఘనంగా కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో లైబ్రరీలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు వివిధ శిక్షణాంశాలను వివరించారు. మానవత జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు నీతికథలు చెప్పడం, నైతిక విలువలతో కూడిన విద్య తదితర అంశాలను చిన్నారులకు వివరించారు. గ్రంథపాలకుడు గణితంపై చిన్నారులకు మెలకువలను అందించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి భీమడోలు ఐసీడీఎస్ పీవో ఎండీ షహనాజ్‌బేగం, కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా షహనాజ్‌బేగం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోదుడు, సంఘ సంస్కర్త టంగుటూరి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయనఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళా కానిస్టేబుల్ దుర్గాదేవి, పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



చెస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

దెందులూరు: మండలంలోని వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం పోతునూరు గ్రంథాలయంలో జూనియర్ సీనియర్ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై వక్తలు వివరించారు. గత నాలుగు రోజులుగా చెస్ ఆట గురించి వివరించి నేర్పించారు. పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు మాట్లాడుతూ వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి



గణపవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ఓంకార్‌నాథ్

గణపవరం: ప్రతి నెలా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని, వేసవి దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. మంగళవారం గణపవరం గ్రామ సచివాలయం–3 పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 120 మందికి వైద్యపరీక్షలు చేశారు. షుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. 15మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. సాధారణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ప్రతి నెలా ఈఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో 67 రకాల మందులు ఇస్తారని, 14 రకాల రక్త పరీక్షలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో డ్వాక్రా సంఘాలు



స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న సెర్ప్ సీఈఓ కరుణ

దెందులూరు: స్వయం సహాయక సంఘాల సభ్యుల అవసరాలకు అనుగుణంగా సూక్ష్మ రుణ ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందని సెర్ప్ సీఈఓ కరుణ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెలుగు దెందులూరు మండల ఏపీఎం సురేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న యాన్యువల్ క్రెడిట్ లైవ్ లీ హుడ్ ప్లాన్ సర్వేలో పాల్గొని ఏ విధంగా జరుగుతుంది, డ్వాక్రా సంఘ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఏ ఏ జీవనోపాధులు చేస్తున్నారు, ఏ విధంగా ఆదాయం వస్తుంది, రాబోయే రోజుల్లో ఏ విధమైన అప్పులు వారికి అవసరం తెలుసుకుని వారికి రాబోయే సంవత్సర కాలంలో సూక్ష్మ రుణ ప్రణాలిక తయారు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆర్. విజయరాజు, ప్రాజెక్ట్ సిబ్బంది ,మేనేజర్లు, ఎపీఎంలు, సీసీలు, వీఓఏలు హాజరయ్యారు.తొలుత దెందులూరు ఏపీఎం సురేష్, శరత్ స్వయం ఉపాధి సంఘాల స్వయం ఉపాధి పొదుపు రుణాలు రికవరీపై గ్రామాల వారీగా సీఈఓ కు వివరించారు.

సచివాలయాల క్లస్టర్ విధానం సరికాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌వోలు

గణపవరం: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకువచ్చి రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా చేయాలన్న నిర్ణయం సరికాదని గణపవరం మండల విఆర్‌వో అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈమేరకు గణపవరం తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈక్లస్టర్ విధానం వలన 7500 మంది విఆర్‌వోలు మిగులుగా ఉంటారని వీరిని ఎలా సర్దుబాటు చేస్తారన్నది ప్రభుత్వం వివరించలేదన్నారు. ప్రస్తుతం రీసర్వే చేస్తున్న సమయంలో రెండు సచివాలయాలకు ఒక విఆర్‌వోను నియమించాలన్న నిర్ణయం సరికాదని, దీనివలన పనిభారం విపరీతంగా పెరిగిపోయి తీవ్ర ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో మండల విఆర్‌వోల సంఘం అధ్యక్షుడు కేశవమూర్తి, పలువురు విఆర్‌వోలు పాల్గొన్నారు.



భీమడోలు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

జీఓ–4 నుంచి వీఆర్‌ఓలను మినహాయించాలి

భీమడోలు: జీవో నంబర్–4 గ్రామ రెవెన్యూ అధికారులను పలు ఇబ్బందులుకు గురి చేస్తుందని వీర్వోలు భీమడోలు తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే అనారోగ్య కారణాలతో ఉద్యోగాలు చేస్తున్న వీఆర్వోలకు 2 సచివాలయాలు కేటాయించడం తగదన్నారు. జీవో నంబర్ 4 నుంచి వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. క్లస్టర్ విధానంతో వీర్వోలను మిగులు సిబ్బందిగా చూపించి వారిని ఇతర శాఖల్లో విలీనం చేయాలనుకోవడం దారుణమన్నారు. తక్షణం ప్రభుత్వం వీర్వోల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆ వినతి పత్రంలో వీర్వోలు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందులపాటి శంకర్, వెజ్జు వినయ్,కె.వీరప్రతాప్, డి. సింహాచలం, సోమశేఖర్, మార్కేండేయులు, ఏ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషిచేస్తాం

దెందులూరు: మండలంలోని దెందులూరుకు చెందిన పోకల రాంబాబు వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, స్థానిక పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మంగళవారం స్థానిక విలేకరులతో తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబుకు పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. దెందులూరు గ్రామానికి చెందిన తొత్తడి వేదకుమారికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేదకుమారికి పార్టీ నేతలు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

21 నుంచి పూళ్లలో ఆరోగ్యమాత మహోత్సవాలు

భీమడోలు : పూళ్ల పడమర ఉపదేశి పరిధిలో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు 25వ ఆరోగ్యమాత మహోత్సవాలు, 3వ ఆరోగ్యమాత దేవాలయ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పూళ్ల పడర ఉపదేశి సంఘం నిర్వాహకులు మంగళవారం తెలిపారు. భీమడోలు విచారణ పరిధిలోని పూళ్లలో జరగనున్న ఆరోగ్యమాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరిసర గ్రామాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ ఉత్సవాలు విజయవంతం చేసి ఆధ్యాత్మికంగా ఎదగాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలోని పూళ్ల సబ్ స్టేషన్ ఏరియాలో మొక్కలు తొలగించడం, విద్యుత్ లైన్లకు మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా ఈనెల 21వ తేదీ బుధవారం పూళ్ల, ఎంఎం పురం ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శివాజీ తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

జిల్లాలో సెర్ప్ సీఈఓ పర్యటన



స్వయం సహాయ సంఘాల పనితీరును వివరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): రాష్ట్ర సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి ఏలూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధిని పరిశీలించేందుకు మంగళవారం ఏలూరు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్న కరుణ వాకాటిని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్న రుణాలు, వాటిని వారు ఏ విధంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్న విషయాలను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కరుణ వాకాటి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాల ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకుని అభివృద్ధి పథంలో వెళుతున్నారని, రుణాల రికవరీ కూడా 99 శాతానికి పైగా ఉందని, బ్యాంకులు కూడా డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ. 6.10 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ లెక్కింపులో శ్రీవారికి హుండీల ద్వారా రూ. 6,10,704 ఆదాయం సమకూరింది. ఈ ఆలయంలో గత మార్చి 24వ తేదీన చివరిసారిగా హుండీ ఆదాయం లెక్కించగా ప్రస్తుతం వచ్చిన ఆదాయం 58 రోజులకుగాను వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ఈతకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ కుమార్ పర్యవేక్షించారు.

చిరుజల్లులతో ఉపశమనం

కొయ్యలగూడెం: చిరుజల్లులతో తీవ్రమైన ఎండల వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. మంగళవారం ఉపరితల ఆవర్తనం వలన కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ఎట్టకేలకు రహదారులకు మోక్షం



అధ్వానంగా ఉన్న శ్రీనివాసపురం రోడ్డు

- రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ కార్యవర్గం తీర్మానం
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు

జంగారెడ్డిగూడెం: అధ్వానంగా ఉన్న రోడ్లకు మోక్షం కలగనుంది. మున్సిపల్ పాలకవర్గం రోడ్ల నిర్మాణానికి తీర్మానించింది. పట్టణంలో ప్రధాన రహదారులైన శ్రీనివాసపురం రోడ్, సుబ్బంపేట రోడ్ నిర్మాణానికి మున్సిపల్ కార్యవర్గం సంకల్పించింది. ఇందు కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి జంగారెడ్డిగూడెం పట్టణాన్ని కలిపే శ్రీనివాసపురం రోడ్డు నిత్యం రద్దీతో ఉంటుంది. బుట్టాయగూడెం మండలంలోని గుబ్బలమంగమ్మ గుడికి ఈ రహదారి గుండానే వెళతారు. ఏ అవసరం వచ్చిన చుట్టుపక్కల ప్రధాన పట్టణం కావడంతో ఏజెన్సీ ప్రాంతాలైన జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల నుంచి జంగారెడ్డిగూడెం వస్తుంటారు.

శ్రీనివాసపురం రోడ్డులోనే ప్రభుత్వ కార్యాలయాలు

శ్రీనివాసపురం రోడ్డులో డిగ్రీ, జూనియర్ కాలేజ్, 100 పడకల ఆసుపత్రి, బీఎస్ఎన్ఎల్, రిజిస్ట్రార్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రహదారి స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీనివాసపురం బైపాస్ జంక్షన్ వరకు అధ్వానంగా తయారైంది. గోతుల మయంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 1.2 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ కార్యవర్గం ఈ రోడ్డు నిర్మాణానికి తీర్మానించింది. 1.2 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.71 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.70 లక్షలు, మొత్తం రూ.1.41 కోట్లు వెచ్చించనున్నారు. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చిచేందుకు అనుమతుల కోసం ఏడీపీ (యాన్యువల్ డెవలప్‌మెంట్ ప్లాన్)కు పంపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

వైభవంగా సాయి మందిరం వార్షికోత్సవం



బాబా మందిరంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మోతేవారి తోటలోని శ్రీ సాయి మందిరం తృతీయ వార్షికోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం బాబాకు ప్రత్యేక హోమాలు, విశేష అబిషేకాలు నిర్వహించారు. అనంతరం బాబాకు విశేష అలంకరణ చేసి హారతులు సమర్పించారు. మధ్యాహ్నం బాబా సన్నిధిలో మహా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 1500 మంది భక్తులు పాల్గొని బాబా అన్నప్రసాదం స్వీకరించారు. అర్చకులు సి.నరసింహాచారి, సాయి సందీప్ హోమాలు, అభిషేకాలు నిర్వహించగా మందిర కమిటీ కన్వీనర్ పెదపాటి రామకృష్ణ, పెదపాటి శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని బాబాను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.